

6

దేవుడి సొమ్మును దేవదాయ శాఖ అధికారులే దోచేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన కార్యనిర్వాహక అధికారులే ఈ దోపిడీలో కీలక పాత్రధారులవుతున్నారు. ఉయ్యూరులోని శ్రీసోమేశ్వరస్వామి దేవస్థానంలో చోటుచేసుకున్న స్వాహాపర్వమే ఇందుకు నిదర్శనం. సోమేశ్వరుడికి చెందిన సుమారు రూ.4 కోట్లను దేవదాయ శాఖ అధికారులు మింగేశారు.



సోమేశ్వరుడి సొమ్ము స్వాహా

ఉయ్యూరు సోమేశ్వర ఆలయంలో రూ.4 కోట్లు హాంఫట్

- ఆలయానికి 26 ఎకరాల పొలం.. హైవే నిర్మాణంలో పోయిన 6 ఎకరాలు
- నష్టపరిహారంగా రూ.8 కోట్లు.. ఎఫ్‌డీ చేసిన అధికారులు
- ఐదేళ్లుగా వడ్డీ రూపంలో వచ్చిన మొత్తం స్వాహా
- ఆలయానికి వచ్చే ఆదాయంలోనూ చేతివాటం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో శ్రీసోమేశ్వరస్వామి దేవస్థానానికి సుమారు 26 ఎకరాల పొలం ఉంది. ఈ భూమిలోని ఆరు ఎకరాలు విజయవాడ-మచిలీపట్నం హైవే నిర్మాణంలో పోయింది. నష్టపరిహారంగా దేవస్థానానికి రూ.8.36 కోట్లు అందాయి. 2018లో ఈ మొత్తాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. దానిపై అప్పట్లో ఏడాదికి రూ.55 లక్షల పైబడి వడ్డీ వచ్చేది. దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చిన వడ్డీలో 2/3వ వంతు మొత్తాన్ని మళ్లీ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలి. మిగిలిన 1/3వ వంతు మొత్తాన్ని దేవస్థానం ఖర్చుల నిమిత్తం వినియోగించుకునే వెసులుబాటు ఉంది. అంటే.. వడ్డీగా వచ్చిన మొత్తంలో రూ.36.60 లక్షలను ఏటా మళ్లీ డిపాజిట్ చేయాలి. ఇలా వచ్చిన వడ్డీ మొత్తాన్ని 2018 నుంచి 2019 వరకు దేవస్థానం సిబ్బందే బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో భద్రపరిచారు. దీంతో 2019 నాటికి సుమారు రూ.10 కోట్ల వరకు దేవస్థానానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో నిల్వ ఏర్పడింది. ఆ తర్వాత బాధ్యతలు స్వీకరించిన ఈవో సురేశ్.. వడ్డీ మొత్తాన్ని పక్కదారి పట్టించేశారు. ఏడాదికి రూ.70 లక్షల పైచిలుకు వడ్డీ రూపంలో వస్తున్నా, అందులో రూ.57 లక్షలను ఎఫ్‌డీల రూపంలో మళ్లీ బ్యాంకులో వేయాల్సి ఉన్నా, ఐదేళ్లుగా ఆ విధానం అమలు కావట్లేదు. దీంతో దేవస్థానానికి చెందాల్సిన రూ.2.85 కోట్లు పక్కదారి పట్టాయి. మిగిలిన రూ.1.15 కోట్లను ఆలయ ఖర్చుల కోసం వినియోగించుకునే వెసులుబాటు ఉంది. ఆ మొత్తాన్ని కూడా దొంగ లెక్కలతో దోచేశారు.

ఆలయ ఆదాయం కూడా..

ఉయ్యూరు పట్టణంలో సోమేశ్వరస్వామి ఆలయానికి 9 దుకాణాల సముదాయం ఉంది. వీటి నుంచి ఏడాదికి రూ.లక్షన్నర వరకు ఆదాయం వస్తుంది. ఆలయానికి మిగిలిన 20 ఎకరాల్లో 10 ఎకరాలకు సంబంధించిన లీజును అర్చకుల జీతభత్యాలకు వినియోగిస్తుండగా, మిగిలిన 10 ఎకరాల నుంచి ఏడాదికి రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తోంది. వీటన్నింటినీ ఆలయ ఖర్చులకు లెక్కలు కట్టేశారు. వాస్తవానికి ఆలయంలో జరిగే ఏ చిన్న పనైనా దాతలు ముందుకొచ్చి చేయిస్తుంటారు. చివరికి ఏటా జరిగే ఉత్సవాలు సైతం దాతల ఖర్చులతోనే చేస్తుంటారు. ఈ పనులను సైతం ఆలయం సొమ్ముతో చేసినట్లు చూపి నిధులు స్వాహా చేయడం గమనార్హం.

మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని అండతో..

ఉయ్యూరు సోమేశ్వరస్వామి ఆలయ ఈవో సురేశ్ గతంలో కొండాలమ్మ ఆలయంలో ఈవోగా విధులు నిర్వహించారు. గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఆశీసులతో చాలాకాలం అక్కడే ఆయన విధులు నిర్వహించారు. ఆ సమయంలోనూ ఆయనపై పలు ఆరోపణలు వచ్చాయి. హుండీల లెక్కింపు సమయంలో అటెండర్లు, అర్చకుల సాయంతో డబ్బు పక్కదారి పట్టించేవారన్న ఆరోపణలు ఉన్నాయి. కొడాలి నాని ఆశీసులు ఉండటంతో అధికారులెవరూ ఈయనపై చర్యలు తీసుకునే సాహసం చేసేవారు కాదు. సోమేశ్వర ఆలయంలో జరిగిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు.. వాటిపై వడ్డీల గోల్‌మాల్‌పై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది



గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అరెస్టు చేస్తారా? లేదా? అనే అంశంపై టీడీపీ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ 71వ నిందితుడిగా ఉండటంతో ఆయన్ను అరెస్టు చేశారని శుక్రవారం ప్రచారం జరిగింది. వంశీ ప్రధాన అనుచరులు యూసఫ్ పఠాన్, సర్నాల రమేశ్‌ను మాత్రమే పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఎస్పీ గంగాధర్ స్పష్టం చేశారు. ఈ కేసులో విచారణ కొనసాగుతోందని, ఇప్పటి వరకు 19 మందిని అరెస్టు చేశామని యూసఫ్ పఠాన్‌ను శనివారం కోర్టులో ప్రవేశపెడతామని చెప్పారు. తాజా పరిణామాలతో వంశీ ఎక్కడ ఉన్నాడన్న అంశం సర్వత్రా ఆసక్తి రేపుతోంది.

వంశీ ఎక్కడ?

అమెరికా వెళ్లిపోయాడా? దేశంలోనే ఉన్నాడా?

- గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో 71వ నిందితుడిగా వంశీ
- ఈ కేసులో అరెస్టు చేశారంటూ ప్రచారం.. అరెస్టును ఖండించిన ఎస్పీ
- వంశీ అనుచరులను అదుపులోకి తీసుకున్నట్టు ప్రకటన

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : గన్నవరం టీడీపీ కార్యాలయంపై 2023 ఫిబ్రవరి 20న అప్పటి ఎమ్మెల్యే వంశీ అనుచరులు దాడికి పాల్పడ్డారు. సుమారు 5 గంటలపాటు యథేచ్ఛగా విధ్వంసం సృష్టించారు. దీనిపై అప్పట్లో టీడీపీ నాయకులు కేసులు పెట్టినా పోలీసులు విచారణను అటకెక్కించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ ఈ కేసు ఊపిరిపోసుకుంది. అప్పట్లో విధ్వంసం సృష్టించిన వారిలో 20 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలువురికి బెయిల్ కూడా వచ్చింది. ఈ కేసులో 71వ నిందితుడిగా వంశీ పేరు ఉంది. ఈ నేపథ్యంలో వంశీని అరెస్టు చేస్తారా లేదా అన్న అంశంపై టీడీపీ శ్రేణుల్లో విస్తృత చర్చ నడుస్తోంది. అసలు వంశీ దేశంలో ఉన్నారా లేక అమెరికా వెళ్లిపోయారా అన్న అంశంపై స్పష్టత కొరవడింది.

వంశీ అరెస్టుపై వదంతులు

శుక్రవారం వంశీ అరెస్టుపై వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే శుక్రవారం మధ్యాహ్నం వంశీ సతీమణి గన్నవరం వచ్చారు. వంశీ ఉపయోగించే వాహనశ్రేణిలోనే ఆమె తన బంధువుల ఇంటికి వెళ్లారు. వంశీ వచ్చారన్న సందేహంతో పోలీసులు ఆ వాహనాలను తనిఖీ చేశారు. దీంతో వంశీని అరెస్టు చేశారన్న వార్త ప్రచారంలోకి వచ్చింది. అయితే వంశీ అసలు ఎక్కడ ఉన్నారన్న దానిపై ఆయన అనుచరులే భిన్న కథనాలను ప్రచారం చేస్తున్నారు. వంశీ అమెరికా వెళ్లిపోయారని ఆయన సన్నిహితుల్లో కొందరు ప్రచారం చేస్తుండగా, వంశీ ఇటీవల అమెరికా నుంచి తిరిగి వచ్చారని ప్రస్తుతం రాజస్థాన్ లేదా బెంగళూరులో ఉంటున్నారని ఆయన అనుచరుల్లోనే మరో వర్గం చెబుతోంది. దీనిపై పోలీసుల్లోనూ స్పష్టత లేదు.



నీటితో బందరు కాలువ

కాలువలకు జలకళ

కృష్ణా ఉపనదుల నుంచి ప్రకాశం బ్యారేజీకి చేరుతున్న వరద నీరు

ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో కృష్ణమ్మ పరుగు పెడుతోంది. జిల్లాలోని పంట కాలువలు జలకళను సంతరించుకుంటున్నాయి. కృష్ణాడెల్టాలోని ప్రధాన కాలువలకు సాగునీటి విడుదలను రెండు రోజుల నుంచి పెంచారు. కృష్ణానదికి వరదనీరు ముంచెత్తుతున్న నేపథ్యంలో పట్టిసీమ నుంచి మోటార్ల ద్వారా నీటి పంపింగ్‌ను కూడా నిలిపివేశారు. ప్రకాశం బ్యారేజీ ఎగువన ఉన్న మునేరు, కట్టలేరు వాగుల నుంచి వేలాది క్యూసెక్కుల వరద వస్తుండటంతో కృష్ణాడెల్టాలోని అన్ని ప్రధాన కాలువలకు నీటి విడుదలను పెంచారు. రెండు రోజుల క్రితం విడుదల చేసిన నీరు శివారు ప్రాంతాలకు చేరడంతో అవసరాలకు అనుగుణంగా ఆయా బ్రాంచ్ కాలువలకు సాగునీటిని విడుదల చేస్తున్నారు.

- రైవస్, కేఈబీ, ఏలూరు, బందరు కాలువలకు 9,500 క్యూసెక్కులు విడుదల
- ఇప్పటివరకు జిల్లాలో 98 వేల హెక్టార్లలో వరినాట్లు

మచిలీపట్నం-ఆంధ్రజ్యోతి : ప్రకాశం బ్యారేజీ నుంచి బందరు కాలువకు 1500 క్యూసెక్కులు, దివిసీమ ప్రాంతానికి సాగునీటిని అందించే కేఈబీ కాలువకు 1500 క్యూసెక్కులు, ఏలూరు కాలువకు 1500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. గుడివాడ, గుడ్లవల్లేరు, బంటుమిల్లి, కృత్తివెన్ను తదితర ప్రాంతాలకు సాగునీటిని అందించే రైవస్ కాలువకు 5వేల క్యూసెక్కులకుపైగా నీటిని విడుదల చేస్తున్నారు. వరినాట్లు వేసే పనులను రైతులు వేగవంతం చేశారు. కొన్నిరోజులుగా పామర్రు, గుడివాడ, బందరు, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, కైకలూరు తదితర ప్రాంతాల్లోని పంట పొలాలకు, తాగునీటి చెరువులకు, చేపల చెరువులకు సాగునీరు అందకపోవడంతో రైతులతోపాటు శాసనసభ్యులు నీటిపారుదలశాఖ అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఇటీవల కాలంలో జరిగిన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ, సాగునీటి సలహామండలి సమావేశంలోనూ ఎమ్మెల్యేలు సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. పట్టిసీమ ప్రాజెక్టు నుంచి నీటి పంపింగ్‌ను పెంచి వంతుల వారీగానైనా ప్రధాన కాలువలకు పూర్తిస్థాయిలో సాగునీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. జిల్లా సరిహద్దున ఉన్న తెలంగాణా ప్రాంతంలో వర్షాలు కురవడంతో ఉపనదుల ద్వారా వరదనీరు కృష్ణానదిలోకి చేరుతోంది. దీంతో ప్రధాన కాలువలకు నీటి విడుదలను పెంచారు. దీంతో జిల్లాలోని 266 తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపడానికి మార్గం సుగమమైంది.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 1.65 లక్షల హెక్టార్లలో వరిసాగు జరుగుతుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారుల అంచనాగా ఉంది. ఇప్పటివరకు 98 వేల హెక్టార్లలో వరినాట్లు వేశారు. ఇందులో 37 వేల హెక్టార్లలో వెదజల్లే పద్ధతిన వరినాట్లు వేశారు. 61 వేల హెక్టార్లలో వరినాట్లు పూర్తిచేశారు. సాగునీటి విడుదల ఆలస్యం, సక్రమంగా, సకాలంలో విడుదల చేయకపోవడం కారణంగా పంట కాలువల శివారు ప్రాంతంలో ఉన్న పామర్రు, చల్లపల్లి, మచిలీపట్నం, గుడ్లవల్లేరు, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను తదితర మండలాల్లోని 67 వేల హెక్టార్లలో వరినాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. దివిసీమ ప్రాంతంలోని కోడూరు, నాగాయలంక, మచిలీపట్నం మండలంలో 9వ నెంబరు కాలువ పరిధిలోని పెదయాదర, వాడపాలెం, చిన్నాపురం, కోన, తుమ్మలచెరువు తదితర గ్రామాల్లో నారుమడులు పోసే పనులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి నారు కొనుగోలుచేసి తీసుకువచ్చి వరినాట్లు వేసే పనులను రైతులు చేస్తున్నారు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తుండటంతోపాటు కాలువలకు నీరు విడుదల జరగడంతో సముద్రతీర ప్రాంతంలోనూ వ్యవసాయ పనులు వేగవంతమయ్యాయి.

98వేల హెక్టార్లలో వరిసాగు

ఏలూరు రేంజ్ సీఐల బదిలీలు



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 2 : ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్న సీఐలలో 41 మందిని బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ జిల్లా, డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలో పని చేస్తున్న 41 మందికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే వివిధ కారణాల వల్ల ఇద్దరు సీఐల బదిలీలు నిలిపివేసినట్లు సమాచారం. పోలవరం సీఐగా పనిచేస్తున్న మధుబాబు, గన్నవరం ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న పెద్దిరాజుల బదిలీలను నిలిపివేస్తూ ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అతి చేసిన కొందరిని ప్రభుత్వం వీఆర్‌కు పంపింది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
ఎన్.వీ నారాయణ	డీపీటీసీ మచిలీపట్నం	గన్నవరం ట్రాఫిక్ -2 పీఎస్
రవికుమార్	గన్నవరం ట్రాఫిక్-2 పీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్
జె.మురళీకృష్ణ	వీఆర్ ఏలూరు రేంజ్	కంకిపాడు సర్కిల్
వి.శ్రీనివాసరావు	కంకిపాడు సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
టీవీవీ రామారావు	పెనమలూరు యూపీఎస్	ఉయ్యూరు టౌన్ యూపీఎస్
ఎండీ హబీబ్‌భాషా	ఉయ్యూరు టౌన్ యూపీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్
సోమేశ్వరరావు	టీసీఆర్ మచిలీపట్నం	గుడివాడ రూరల్ సర్కిల్
కె.ఏసుబాబు	గుడివాడ రూరల్ సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
వి.పెద్దిరాజు	గన్నవరం ట్రాఫిక్-1 యూపీఎస్	గుడివాడ టుటౌన్ పీఎస్
ఎం.నాగదుర్గారావు	గుడివాడ టుటౌన్ పీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్



పింగళి దేశభక్తి ఆదర్శం

- కలెక్టర్ బాలాజీ, ఎస్పీ నివాళులు

6లో..

బ్లాక్ స్పాట్‌లపై దృష్టి పెట్టండి

- ప్రమాదాల నివారణకు పటిష్ట కార్యాచరణ
- రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

గూడు పురాణి!

మోపిదేవి మండలంలోని లే అవుట్లలో వైసీపీ నేతల దోపిడీ

- ప్లాట్ల కేటాయింపు నుంచి గృహనిర్మాణం దాకా అన్నీ అక్రమాలే
- సంవత్సరం క్రితమే ఫిర్యాదులొచ్చినా చలించని అధికారులు
- నిజాలు నిగ్గు తేల్చాలని ఎమ్మెల్యే ఆదేశించినా చర్యలు శూన్యం





లే అవుట్ -3లో ఎస్టీలకు దారి లేకుండా జరిగిన ఆక్రమణలు (ఇన్‌సెట్‌లో) మోపిదేవి -1 లే అవుట్‌లో మూడు ప్లాట్లు ఆక్రమించి నిర్మించిన ఇల్లు

పేదలకు గృహ నిర్మాణం పేరుతో వైసీపీ పాలనలో యథేచ్ఛగా అక్రమాలు చోటు చేసుకున్నాయి. జగనన్న కాలనీల్లో చేపట్టిన లే అవుట్లలో ప్లాట్లను లబ్దిదారులకు ఇవ్వకుండా వైసీపీ నేతలు, అనుచరులు ఆక్రమించారు. లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్ల విస్తీర్ణాన్ని తగ్గించి తమకు అనుకూలమైన వారికి ఎక్కువ విస్తీర్ణం ఇచ్చారు. మోపిదేవి మండలంలో 21 లే అవుట్లు వేసి 20 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఇందులో 470 ఇళ్లు మంజూరు కాగా, కేవలం 174 మాత్రమే ఇప్పటి వరకు పూర్త య్యాయి. ప్లాట్ల కేటాయింపు దగ్గర నుంచి ఇళ్లు మంజూరు వరకు వైసీపీ నేతలు చెప్పిందే శాసనమైంది. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ రాజకీయ అండతో ఇంతకాలం ఈ అక్రమా లను తొక్కి పెట్టారు. కూటమి ప్రభుత్వంలో అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

- అవనిగడ్డ, ఆంధ్రజ్యోతి

అధికారుల ఆదేశాలు బేఖాతరు

మోపిదేవి -3 లే అవుట్‌లో జరిగిన అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారులు ఇటీవల స్పందించి ఆక్రమణలు వెంటనే తొలగించాలని, ఎస్టీలకు నిర్మించిన ఇళ్లకు వెళ్లేందుకు రహదారి, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. స్థానిక రాజకీయ నేతల ఒత్తిడితో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ తూతూ మంత్రంగా సాగిపోయింది. కేవలం ఆక్రమించుకున్న వారి భవనాల ముందు నుంచి ఓ కచ్చా డ్రైన్ తవ్వి చర్యలు తీసుకున్నట్టు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు.

ఎమ్మెల్యే ఆదేశాలను తుంగలోతొక్కి..

మోపిదేవి మండలంలో జరిగిన ఇళ్ల స్థలాల కేటాయింపు, గృహనిర్మాణంలో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాలని అవనిగడ్డ నుంచి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులను కోరినప్పటికీ అధికారుల నుంచి కనీస స్పందన లేదు. అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఇవిగో అక్రమాలు

మోపిదేవిలోని బీసీ గురుకుల కళాశాల వద్ద ఏర్పాటు చేసిన లే అవుట్-1లో మొత్తం 74 ప్లాట్లు వేశారు. అందులో 69 మందికి పట్టాలు మంజూరు చేశారు. వీటిలో 1 నుంచి 7 వరకు ప్లాట్లు ఎవరికీ కేటాయించకుండా ఖాళీగా ఉంచారు.

- అదే లే అవుట్‌లో 27, 33, 50, 53, 55, 59, 60, 67, 68 ప్లాట్లు కూడా ఎవరికీ కేటాయించకుండా వైసీపీ నేతలు ఆక్రమించారు.
- 12, 13, 14 నెంబర్ల ప్లాట్లను రెవెన్యూ కార్యాలయానికి చెందిన ఓ ఉద్యోగి ఆక్రమించుకుని భారీస్థాయిలో మూడు ప్లాట్లలో కలిసి పక్కా ఇల్లు నిర్మించాడు. మూడు ప్లాట్లలో గృహనిర్మాణం చేపట్టిన వ్యక్తికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మోపిదేవి సబ్ స్టేషన్ వద్ద ప్లాటు కేటాయించింది.
- రావివారిపాలెంలోని లే అవుట్-4లో 270 ప్లాట్లు వేశారు. 258 మందికి పట్టాలిచ్చారు. ఈ లే అవుట్‌లో 232వ ప్లాట్‌ను ఎవరికీ కేటాయించకపోయినప్పటికీ తహసీల్దార్ కార్యాలయంలోని ఉద్యోగి ఇంటి నిర్మాణం చేపట్టారు.
- మోపిదేవిలోని లే అవుట్-3లో ఎస్టీలకు ఆరు, ఇతర సామాజిక వర్గాలకు రెండు ప్లాట్లు కేటాయించారు. ఆరుగురికి కేటాయించిన 9 సెంట్ల స్థలంలో అధికారులు 9 మంది లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించారు. రికార్డుల్లో 9 మందికి ప్లాట్లు కేటాయించినట్టు చూపారు. అంటే ఆరుగురు కోసం కేటాయించిన స్థలంలో 9 మందికి ఇంటి నిర్మాణం చేశారు. ఈ విషయాన్ని జనసేన నేతలు గత సంవత్సరం కలెక్టర్ దృష్టికి తీసుకెళితే అధికారులు విచారణ చేపట్టారు కానీ బాధ్యులపై చర్యలు తీసుకోలేదు.




పింగళి వెంకయ్య చిత్రపటం, విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధర్

పింగళి దేశభక్తి అందరికీ ఆదర్శం

▸ కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ నివాళులు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 2 : జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య దేశభక్తి నేటితరానికి ఆదర్శమని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో వెంకయ్య చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ పతాకం దేశ చరిత్ర పుటల్లో నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి, శ్యామ్, లంకిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు. చిలకలపూడి స్టేషన్ వద్ద పింగళి వెంకయ్య విగ్రహానికి జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. డీఎస్పీ అబ్దుల్ సుబాన్, మైత్రీ ఫౌడేషన్ అధ్యక్షుడు వేణు కుమార్, సింగరాజురాజీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




పింగళి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పింగళికి భారతరత్న ఇవ్వాలి : వర్ల కుమార్‌రాజా

కూచిపూడి: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పింగళి స్వగ్రామమైన భట్లపెనుమర్రు గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కుమార్‌రాజా ముఖ్యఅతిథిగా పాల్గొని పింగళి విగ్రహానికి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్ మట్టా ఇందిర, చలసాని శ్రీనివాసరావు, కొడాలి దయాకర్, గొట్టిపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయ ఈవోగా లీలాకుమార్ బాధ్యతలు



పెనుగంచిప్రోలు, ఆగస్టు 2 : తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం అధికారిగా, డిప్యూటీ కమిషనర్ జీవీడీఎల్ లీలాకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా లీలాకుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం లీలాకుమార్‌కు అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదాలను, స్వామివారి శేషవస్త్రం అందజేశారు. ఇప్పటి వరకు కార్యనిర్వహణాధికారిగా పనిచేసిన డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్‌నాయుడు సచివాలయ జీఏడీ జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్డ్‌మెంట్‌కు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ప్రారంభం

లబ్బీపేట, ఆగస్టు 2 : మనదేశానికి వస్త్ర ఉత్పత్తిలో విశిష్ట చరిత్ర, సంస్కృతిలో చేనేతకు ప్రత్యేక స్థానం ఉందని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ అన్నారు. బందరు రోడ్డులోని శేషసాయి కళ్యాణమండపంలో ఏర్పాటుచేసిన సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పోను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అనూరాధ మాట్లాడుతూ, మన కళాకారులు నేసిన ప్రతి దారం సంప్రదాయం, నైపుణ్యం, అంకితభావాన్ని చాటుతున్నాయని అన్నారు. హస్తకళాకారుల శాశ్వత వారసత్వానికి ఇది నిదర్శనమన్నారు. అనంతరం షోరూం నిర్వాహకులు సతీష్‌కుమార్ మాట్లాడుతూ, సుమారు 20 రాష్ట్రాల నుంచి బనారస్ చీర, భాగల్‌పురి సిల్క్, బెంగళూరు సిల్క్, చెన్నై సిల్క్, మైసూర్ సిల్క్, ధర్మవరం, పోచంపల్లి, జామ్దానీ, లెనిన్ కాటన్, టస్సార్, విష్ణుపురి సిల్క్, డ్రెస్ మెటీరియల్, చందేరి, ఆభరణాలు తదితర హస్తకళా వస్తువులు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని, ఈ ప్రదర్శన అగస్టు 7వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.



హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ప్రారంభిస్తున్న గద్దె అనురాధ



ప్లాస్మా ఎగ్జిబిషన్ పోస్టర్ అవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

5 నుంచి పీబీ సిద్ధార్థలో వైజ్ఞానిక ప్రదర్శన

మొగల్రాజపురం, ఆగస్టు 2 : పీబీ సిద్ధార్థ కళాశాలలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసెర్చి (అణుశక్తి విభాగం) సౌజన్యంతో తొలిసారి 32 నమూనాలతో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ మేకా రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్లాస్మా, దానివల్ల ఉపయోగాలు తదితన అంశాలతో ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఐదు రోజుల ప్రదర్శనలో శాస్త్రవేత్తలు మార్గదర్శనం చేస్తారని చెప్పారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. అనంతరం ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌లను అవిష్కరించారు. డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్ జంపాల తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రారంభించండి

▸ ఆర్థికమంత్రికి ఎమ్మెల్సీ లక్ష్మణరావు వినతి

గవర్నర్‌పేట, ఆగస్టు 2 : రాష్ట్ర వ్యాప్తంగా 5 వేలమంది కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శుక్రవారం సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చట్టం చేసి, జీవో నెంబరు 114 విడుదల చేసిందని, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో 10,117 మందిని రెగ్యులర్ చేయడానికి అనుమతించారని తెలిపారు. విద్యాశాఖలో సుమారు ఐదు వేల మందిని రెగ్యులరైజేషన్ చేయాల్సి ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ఫైల్ ఆమోదించాలని కోరారు. సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, ఏపీ రెసిడెన్షియల్, గిరిజన సంక్షేమ గురుకులాలలో పనిచేస్తున్న సిబ్బంది పదవీవిరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు.



మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ

గెజిటెడ్ అధికారుల జేఏసీ వైస్ చైర్మన్‌గా వినుకొండ



ధర్నాచౌక్, ఆగస్టు 2 : ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ అధికారుల జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా వినుకొండ రాజారావు నియమితులయ్యారు. గాంధీనగర్‌లోని కార్యాలయంలో జేఏసీ చైర్మన్ కేవీ కృష్ణయ్య నియామక పత్రాన్ని ఆయనకు శుక్రవారం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజారావు ఉన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ, జవాబుదారీతనంతో ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తున్న రాజారావును జేఏసీ వైస్ చైర్మన్‌గా నియమించడం జరిగిందన్నారు. అధికారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జేఏసీ పటిష్ట నిర్మాణానికి కృషి చేయాలని రాజారావును కోరారు. జేఏసీ ప్రధానకార్యదర్శి మేడిపల్లి అజయ్, కన్వీనర్ ఎం.తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా పంద్రాగస్టు

▸ ఐజీఎం స్టేడియంలో ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, అగస్టు 2 : రాష్ట్రస్థాయి 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాట్లపై కలెక్టర్ శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 78వ స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు వేడుకలో పాల్గొంటారన్నారు. సుమారు ఆరు వేలమందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారని, వారికి అవసరమైన అల్పాహారం, తాగునీరు అందించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాంగణంలో నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా విద్యుత్ అధికారులు జనరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలను ప్రత్యక్ష ప్రసారం చేయడంతో పాటు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేయాలని సమాచార శాఖ అధికారులను ఆదేశించారు. పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, అర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో, ఫైర్, ఏపీఎస్‌ఆర్టీసీ, మెడికల్ అండ్ హెల్త్, సివిల్ సప్లై తదితర అధికారుల సమన్వయంతో ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. సాధారణ పరిపాలన శాఖ వీఐపీలకు వీవీఐపీలకు ప్రొటోకాల్ ప్రకారం కేటాయించిన గ్యాలరీల వారీగా పాస్‌లను మంజూరు చేయాలన్నారు. ఏర్పాట్లలో ఎటువంటి సమస్యలు ఎదురైనా తక్షణం తన దృష్టికి తీసుకురావాలన్నారు. రిహార్సల్స్ నాటికి పూర్తిస్థాయి ఏర్పాట్లతో ప్రాంగణాన్ని సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, ఆర్డీవో భవానీశంకర్, డీసీపీలు గౌతమిశాలి, ఏడీటీఎస్ ఉదయరాణి, కె.చక్రవర్తి, ఏసీపీ కె.దామోదరరావు, సమాచారశాఖ రీజనల్ ఇంజినీర్ సీపీ కృష్ణారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి యు.వెంకట సుబ్బారావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వీకే విజయశ్రీ, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్, ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్, వీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్ వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బ్లాక్ స్పాట్‌లపై దృష్టి సారించండి

▸ రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ కార్యాచరణ ▸ రహదారి భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్ సృజన



వివిధ శాఖల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 2 : ఎన్టీఆర్ జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, ఇందుకు ప్రధానంగా ప్రమాదాలు ఎక్కువ జరిగే ప్రాంతాలు (బ్లాక్ స్పాట్)లపై సమన్వయ శాఖల అధికారులు దృష్టిసారించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారి భద్రత కమిటీ (డీఆర్ఎస్‌సీ) సమావేశం జరిగింది. పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర్‌బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, డీసీపీ (లా అండ్ ఆర్డర్) గౌతమి శాలి, డీసీపీ (ట్రాఫిక్) కె.చక్రవర్తి, డిప్యూటీ రవాణా కమిషనర్ ఎం.పురేంద్ర తదితరులు హాజరయ్యారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, బ్లాక్ స్పాట్‌లు, రహదారి భద్రత ఉల్లంఘనలపై చర్యలు, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్ స్కీం-2022, ఐ-రాడ్ అమలు, వీఎంసీ సురక్షిత రవాణా ప్రణాళిక, రహదారి ప్రమాదాల నివారణ చర్యలపై చర్చించారు. గత సమావేశంలో తీసుకున్న చర్యలను సమీక్షించారు. ట్రాఫిక్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుకల్పించే అస్త్రం-ఎఎస్‌టీఆర్‌ఎం (యాక్షనబుల్ ఇంటెలిజెన్స్ ఫర్ సస్టైనబుల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్) యాప్‌పైనా చర్చించారు. ఇప్పటికే ఈ వ్యవస్థ బెంగళూరులో అమల్లో వుంది. అదేవిధంగా జిల్లాలో రహదారి ప్రమాదాల వివరాలను డిప్యూటీ రవాణా కమిషనర్ ఎం.పురేంద్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

139 బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు

కలెక్టర్ సృజన మాట్లాడుతూ అధికారులు నిబద్ధత, సమన్వయంతో పనిచేసి రహదారి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-30, ఎన్‌హెచ్-65, ఎన్‌హెచ్-192, ఎన్‌హెచ్-236, ఎన్‌హెచ్-32, ఇతర రహదారుల్లో మొత్తం 139 బ్లాక్ స్పాట్‌లు గుర్తించడం జరిగిందని, ఈ ప్రాంతాల్లో సంయుక్త తనిఖీలు నిర్వహించి ముందు ప్రమాదాలు జరుగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరం మేరకు స్పీడ్ బ్రేకర్లు, సైన్‌బోర్డులు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఐ-రాడ్ యాప్‌లో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రిజిస్టర్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. రహదారి ప్రమాదాలపై విద్యా సంస్థల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రమాదాలు జరిగే సమయంలో 108 వాహనాల స్పందన సమయాన్ని మరింత మెరుగుపరిచేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్‌సీసీ సమావేశంలో ప్రతి నిర్ణయాన్ని పటిష్టంగా అమలుచేయాలని కలెక్టర్ సృజన సూచించారు.

సరైన డేటా విశ్లేషణతో ప్రణాళికల రూపకల్పన : సీపీ రాజశేఖరబాబు

విజయవాడలో ట్రాఫిక్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు రియల్‌టైం డేటా విశ్లేషణతో ప్రణాళిక రూపకల్పనకు చర్యలు తీసుకోనున్నట్టు సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు తెలిపారు. ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో 23 బ్లాక్‌స్పాట్‌లను గుర్తించడం జరిగిందని, ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్టు తెలిపారు.

108 వాహనాలు ఇప్పటికే జీపీఎస్‌తో అనుసంధానమై ఉన్నాయని, మిగిలిన అంబులెన్సులను కూడా అనుసంధానం చేయాల్సిన అవసరం వుందన్నారు. సమావేశంలో వీఎంసీ అదనపు కమిషనర్ కేవీ సత్యవతి, డీపీవో ఎస్‌వీ శివప్రసాద్ యాదవ్, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వీకే విజయశ్రీ, పాఠశాల విద్యాశాఖ ఏడీ కేవీఎన్ కుమార్, ఎన్‌హెచ్ఏఐ మేనేజర్ కె.లత, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

▸ అధికారులతో కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్ , ఆగస్టు 2 : కృష్ణా జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. శుక్రవారం తన చాంబర్‌లో సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖల అధికారులతో హాస్టల్ విద్యార్థుల బాగోగులు, హాస్టల్ నిర్వహణలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హాస్టల్‌లో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించాలన్నారు. దివ్యాంగులకు చేతి కర్రలు, వినికిడి యంత్రాలు ఇవ్వాలన్నారు. బీసీ సంక్షేమ శాఖలో నిధుల కొరత తక్కువగా ఉందని అధికారులు అన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖాధికారి డీడీ షేక్ షాహిద్, బాబు, బీసీ కార్పొరేషన్ ఈడీ శంకరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రమేష్, గిరిజన సంక్షేమ శాఖాధికారి బి ప్రకాష్ రావు, విభిన్న ప్రతిభావంతుల అధికారి వాడ్రేవు కామరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పింఛన్ సొమ్ముతో ఉడాయించిన అగ్రికల్చర్ అసిస్టెంట్

గన్నవరం: సచివాలయం-1లో పనిచేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.రోశయ్య పింఛన్ డబ్బులతో ఉడాయించడంతో అతడ్ని సస్పెండ్ చేశారు. గురువారం అగ్రికల్చర్ అసిస్టెంట్ రోశయ్య రూ.1.86 లక్షలు పింఛన్ డబ్బులో ఉదయం 11గంటల వరకు పంపిణీ చేశాడు. మరో 14 మందికి చెందిన రూ.52.500 మొత్తం ఇవ్వకుండా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి వెళ్లిపోయాడు. రోశయ్య ఎంతసేపటికి రాకపోవడంతో రోశయ్యపై శుక్రవారం పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రోశయ్యను వ్యవసాయ శాఖ జేడీ సస్పెండ్ చేశారు.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మరొకరి అరెస్టు

గన్నవరం : గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మరొకరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. మొత్తం 71 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తొలుత 15 మందిని, తరువాత విడివిడిగా ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి, రిమాండ్‌కు పంపారు. శుక్రవారం సన్నాల రమేష్‌ను అరెస్టు చేసి గన్నవరం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించటంతో స్థానిక సబ్‌జైల్‌కు తరలించారు. ఇప్పటి వరకూ 19 మందిని అరెస్టు చేశారు. ఏ 33గా ఉన్న పఠాన్ యూసఫ్‌ఖాన్ పోలీసుల అదుపులో ఉన్నారు. అతడిని శనివారం కోర్టులో హాజరు పరుస్తామని పోలీసులు తెలిపారు.

అవయవదానంపై అవగాహన పెరగాలి

▸ మంత్రి సత్యకుమార్ యాదవ్



అవయవ దాతల కుటుంబసభ్యులను సత్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

వన్‌టౌన్ ఆగస్టు 2 : అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని, మరొక వ్యక్తికి పునర్జన్మను ఇవ్వడానికి జీవన్‌దాన్ మహాదానమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జీవన్‌దాన్ ఆధ్వర్యంలో జాతీయ అవయవదాన వారోత్సవాలను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, అవయవ దానం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. సమాజానికి మంచి చేయాలన్న ఆలోచన కలగాలని, అవయవ దానంతో మరికొందరి జీవితాలలో వెలుగు నింపవచ్చునని, దీనిపై ప్రజల్లో ఇంకా అవగాహన కలగాలని చెప్పారు. కొన్ని మత ఆచారాలు అవయవ దానం చేస్తే జీవుడు దైవంలో ఐక్యం కాదన్న అపోహ ఉందని, కానీ మనిషి ప్రాణం నిలబెడితే ఆ దైవం కూడా అనుగ్రహిస్తాడని చెప్పారు. ఏటా ఐదు లక్షల మంది అవయవాలు చెడిపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. అవయవ దానంలో దేశ నిష్పత్తి 0.9 ఉండగా, రాష్ట్ర నిష్పత్తి 0.3 మాత్రమే ఉందని గుర్తు చేశారు. 2,600మంది కిడ్నీల మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అవయవాలు దానం చేసేందుకు అర్హతల గురించి వివరించారు. దాతలకు అవగాహన కల్పిస్తున్న వలంటీర్లలు, అధికారులు, వైద్య సిబ్బందికి మంత్రి అభినందనలు తెలిపారు. అవయవ దానం చేసిన వ్యక్తులకు జిల్లా కలెక్టర్, ఎస్పీ పాల్గొని వీర వందనం సమర్పించేలా సీఎంతో మాట్లాడతానన్నారు. అవయవ దానం చేసిన కుటుంబసభ్యులకు ప్రశంసా పత్రం, ఆర్థిక సహాయం కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ అవయవ దానం దినోత్సవం సందర్భంగా ఈనెల 3న కేంద్రం అందించే అవార్డుకు మన రాష్ట్రం ఎంపిక కావటం సంతోషంగా ఉందన్నారు. రాజకీయ పార్టీలు సభ్యత్వాలు తీసుకునే సమయాల్లో అవయవ దానంపై అవగాహన కల్పించి వారిచేత ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు. తాను కూడా అవయవ దానానికి సమ్మతి తెలిపి అప్పటికప్పుడు ప్రొసీజర్ పూర్తిచేశారు.

ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి తన సొంత జిల్లాలో సైతం మెడికల్ కాలేజీలు పూర్తి చేయలేకపోయారని మంత్రి విమర్శించారు. ఆరోగ్యశ్రీ తీసివేశారని విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఆసుపత్రులు బకాయిలు చెల్లించాలని లేఖ రాశాయని, జగన్ పాలనలో 14సార్లు లేఖలు రాశారన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, నేత్ర దానం చేసేందుకు చాలా మంది వస్తున్నారని, ఇదే క్రమంలో అవయవ దానంపై వేలాది మంది రావాల్సిన అవసరం ఉందన్నారు. ఎయిమ్స్ వైద్య కళాశాల ఏర్పాటులో సీఎం చంద్రబాబు కృషి ఎంతో ఉందని, కేవలం రూ.10లకు ఓపీ సేవలు అందుతున్నాయని చెప్పారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ, అవయవ దానం పూర్తి పారదర్శకమని తెలిపారు. దీనిపై విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అవయవ దానం చేసిన వారి అంత్యక్రియలకు వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొని వీర వందనం సమర్పిస్తున్నారన్నారు. దాత కుటుంబసభ్యులకు ప్రశంసా పత్రాన్ని కూడా అందచేస్తున్నామన్నారు. సినీ ప్రముఖులు నాగార్జున, మురళీమోహన్, జగపతిబాబులు అవయవ దాన ప్రచార కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా అవయవ దానం చేసిన వారి కుటుంబాలను సత్కరించారు. తొలుత ఏలూరు లాకుల నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు వైద్య కళాశాలల విద్యార్థులు వాకథాన్ నిర్వహించారు. జీవన్‌దాన్ రాష్ట్ర చైర్మన్ డి.ఎస్.వి.ఎల్ నరసింహం విజయవాడ, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్ కుమార్, డాక్టర్ డి వెంకటేష్, వైద్యులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, మెడికల్ కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బందరు పోర్టు పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారు

▸ ఎంపీ వల్లభనేని బాలశౌరి ప్రశ్న

మచిలీపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : బందరు పోర్టుపనులను ఎప్పటిలోగా పూర్తిచేస్తారని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి శుక్రవారం పార్లమెంట్ సమావేశాల్లో ప్రశ్నించారు. పోర్టును ప్రధానమంత్రి గతిశక్తి పథకంలో ఏ కారణంతో చేర్చలేదని, పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఎంతమేర రుణం పోర్టుకు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా కేంద్ర ఓడరేవులు షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ సమాధానమిస్తూ మేజర్‌పోర్టులు కాకుండా ఇతర ఓడరేవులు సంబంధిత రాష్ట్రాల ప్రభుత్వాల నియంత్రణలోనే ఉన్నాయని తెలిపారు. బందరుపోర్టును ఏపీ ప్రభుత్వం నాన్‌మేజర్‌పోర్టుగానే పరిగణిస్తోందన్నారు. 2025 అక్టోబరు నాటికి పనులు పూర్తిచేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. కేంద్రప్రభుత్వసంస్థ పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి టర్మ్‌లోన్‌గా రూ.3,940.42కోట్లను బందరుపోర్టుకు ఏపీ మేరీటైమ్‌బోర్డు ద్వారా మంజూరు చేశామని తెలిపారు.



భూమి సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ఆలయ భూముల పరిరక్షణకు శ్రీకారం

▸ నందిగామ రామలింగేశ్వరాలయ భూమి సర్వే

నందిగామ, ఆగస్టు 2 : పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయ భూముల పరిరక్షణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పట్టణంలోని ఆర్ఎస్ నెంబర్ 821-1లో గల 5.38 ఎకరాల భూమిని ఆలయ ఈవో గంగాధర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, దేవదాయశాఖ సర్వేయర్లు సర్వే చేసి హద్దులు నిర్ధారించారు. అత్యంత విలువైన ఈ భూమి నుంచి దిగువకు మూడు రహదారులు ఏర్పాటు చేయగా.. సుమారు ఎకరం న్నర భూమి అన్యాక్రాంతమైంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలపై స్పందించిన అధికారులు సంయుక్త సర్వేకు ఆదేశాలు జారీచేశారు. ఈ క్రమంలో శుక్రవారం అధికారులు సర్వే నిర్వహించి హద్దులు నిర్ధారించారు. నందిగామ, చందర్లపాడు మధ్య ఏర్పాటు చేసిన ఆర్‌అండ్‌బీ రోడ్డు కూడా ఈ భూమిలోనే ఉన్నట్టు అధికారులు గుర్తించారు. దీనిపై ఆర్‌అండ్‌బీకి నోటీసులు పంపుతామని ఈవో తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం..

పట్టణంలో అంతర్భాగంగా ఉన్న ఆలయ భూమి ఎకరం సుమారు రూ.20 కోట్లకు పైగా ధర పలుకుతోంది. అంతటి విలువైన భూమిని డ్రెయినేజీ డంప్‌గా మార్చారు. సమీప ప్రాంతాల్లో నిర్వాసితుల వ్యర్థాలను ఆ భూమిలోకి వదులుతున్నారు. దీనికి తోడు రోడ్డు పక్కన వ్యాపారాలు చేస్తున్న వారు సైతం వ్యర్థాలను ఆ స్థలంలో వేస్తున్నారు. ఆలయ భూమి పరిరక్షణ పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఈవో గంగాధర్‌ను వివరణ కోరగా, వారం రోజుల్లో భూమి శుభ్రం చేయిస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

9న క్విట్ కార్పొరేట్‌ను జయప్రదం చేయండి

▸ వడ్డే శోభనాద్రీశ్వరరావు

ధర్నాచౌక్, ఆగస్టు 2: దేశ సంపదను లూటీ చేస్తున్న కార్పొరేట్లను బహిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సమితి సమావేశం శుక్రవారం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. సంయుక్త కిసాన్‌మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 9న 'క్విట్ కార్పొరేట్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రైతులు, ప్రజలు ఈ కార్యక్రమానికి మద్దతు పలకాలన్నారు. రైతు ఉద్యమ విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్రప్రభుత్వం నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. వ్యవసాయంతో పాటు దాని అనుబంధ రంగాల్లోకి అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీల అధికారులను సలహాదారులుగా నియమించారని మండిపడ్డారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాల అమలుకు కేంద్రప్రభుత్వం పూనుకుందన్నారు. సామాన్య ప్రజలపై పన్నుల భారం మోపి కార్పొరేట్లపైన సంపద పన్ను రద్దు చేయడమేకాక కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 20 శాతానికి తగ్గించడం వల్ల కేంద్రానికి ఏడాదికి సుమారు రూ. 1.45 లక్షల కోట్ల ఆదాయం తగ్గుతుందన్నారు. సీనియర్ రైతు నేతలు కేశవరావు, కేవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో చెస్ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 2 : కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్, సన్‌స్టార్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 10న జిల్లా అండర్-13 బాలబాలికల, 11న అండర్-9 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు మచిలీపట్నం సన్‌స్టార్ స్కూల్లో నిర్వహిస్తున్నట్టు జిల్లా సెక్రటరీ ఎస్ఎం ఫణికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-13 కేటగిరిలో తొలి రెండుస్థానాల్లో నిలిచినవారిని శ్రీకాకుళం, అండర్-9 విజేతల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారిని విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. వివరాలకు 81254 44413, 9700775220 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉదయం పోస్టింగ్.. సాయంత్రానికి బ్రేక్

విజయవాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అప్పటి వరకు ట్రాఫిక్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్‌కు లా అండ్ ఆర్డర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఆయన ఉప్పొంగిపోయారు. ఉత్తర్వులు వెలువడిన కొద్ది గంటల్లోనే ఆ పోస్టింగ్ బ్రేక్ పడింది. కృష్ణా జిల్లా గన్నవరం ట్రాఫిక్ 1 పీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న వి.పెద్దిరాజును గుడివాడ టూ టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. ఏలూరు రేంజ్‌లో 41 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ డీఐజీ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఇందులో పెద్దిరాజుకు పోస్టింగ్ ఇచ్చారు. పెద్దిరాజుపై అనేక ఆరోపణలు ఉన్నాయి. గడచిన ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించినట్టు విమర్శలు ఉన్నాయి. దీనితో పెద్దిరాజు పోస్టింగ్‌కు బ్రేక్‌లు పడ్డాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	96, 105, 116
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.50

యాప్, చైన్‌లింకులను నమ్మి మోసపోవద్దు : సీఐ

ఉయ్యూరు, ఆగస్టు 2 : యాప్‌లు, చైన్‌లింకులను నమ్మి మోసపోవద్దని ఉయ్యూరు సీఐ ఎండీ హబీబ్ బాషా అన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలు, యాప్‌లు, చైన్‌లింకుల ద్వారా జరుగుతున్న మోసాలు, వాటిని నమ్మి నష్టపోతున్న వారి వైనాన్ని శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో వివరించారు. పామర్రు ఐసీడీఎస్‌లో పని చేస్తున్న ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌లో డాయ్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని చైన్‌లింకుతో కంకిపాడు, ఉయ్యూరు, పామర్రు ప్రాంతాల్లో పలువురిని చేర్పించి డబ్బు కట్టించారని తరువాత డబ్బు రాకపోవడంతో మోసపోయినట్టు గ్రహించారన్నారు. దీనికి సంబంధించి మోసపోయిన వారు పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేసారని వివరించారు. ఎవరైనా ఆన్‌లైన్‌లో చైన్‌లింకులు పంపితే వాటి సమాచారం పోలీసులకు తెలియజేయాలని, లేదా సైబర్ క్రైమ్ 1930 నంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

పాడి పశువులకు టీకాలు



తెలప్రోలులో పశువులకు గురుక వ్యాధి నివారణ టీకా వేస్తున్న డాక్టర్ మల్లిబాబు

ఉంగుటూరు, ఆగస్టు 2 : వర్షాకాలంలో పాడిపశువులకు సోకే వ్యాధుల పట్ల పశుపోషకులు, రైతులు అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని తెలప్రోలు ప్రభుత్వ పశువైద్యశాల వెటర్నరీ డాక్టర్ చింతల మల్లిబాబు అన్నారు. శుక్రవారం తెలప్రోలు, ఉంగుటూరు, ఆత్కూరు, ఇందుపల్లి ప్రభుత్వ పశువైద్యశాలల వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గురకవ్యాధి రాకుండా పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ సుధీర్‌బాబు, డాక్టర్ నాగార్జున, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లుకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 2 : రౌడీ షీటర్లుగా పోలీస్ రికార్డుల్లో నమోదైన వారంతా క్రమశిక్షణతో మెలగాని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ ఏ.ఎస్. నరసింహమూర్తి హెచ్చరించారు. గురువారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పాటించాల్సిన నియమాలు, నిబద్ధతలను వివరించారు. చెడు నడత నుంచి బయటపడి మంచి పౌరులుగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై జనార్దన్ తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి జయంతి



పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్

ఉయ్యూరు, ఆగస్టు 2 : జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య తెలుగు వారు కావడం తెలుగు జాతికి గర్వకారణమని ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ అన్నారు. పింగళి వెంకయ్య 146 జయంతి పురస్కరించుకుని కళాశాల తెలుగు, చరిత్ర విభాగాలు, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పింగళి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పింగళి కృష్ణాజిల్లాకు చెందిన వారుకావడం మరింత గర్వకారణమన్నారు. కళాశాల ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ, తెలుగు శాఖ అధిపతి ఎంఎల్‌ఎస్ కుమారి, చరిత్ర శాఖ అధిపతి టి.నరసింహారావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి

గన్నవరం, ఆగస్టు 2 : విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలని ప్రిన్సిపాల్ గాయత్రి అన్నారు. స్థానిక చైతన్య పాఠశాల విద్యార్థులు నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్(నాసా) అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. గతేడాది నాసాకు ప్రాజెక్టులు సమర్పించగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గాయత్రి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని సూచించారు. డీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక యాజమాన్యంతో
వరిలో అధిక దిగుబడులు

ఉయ్యూరు, ఆగస్టు 2 : మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక సాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ ఏడీఏ శ్రీనివాస్ తెలిపారు. ఎగినపాడులో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. భూ సార పరీక్షల వల్ల ఉపయోగాలు తెలియజేసి వరినాట్లు వేసిన 30 రోజుల్లో కలుపుతీత వంటి సస్యరక్షణ చర్యలతో పాటు నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. చెరకు పరిశోధనా స్థానం శాస్త్రవేత్త సుధారాణి, వ్యవసాయ అధికారి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులా పుల్లేరు!

- యాకమూరులో సేకరించిన చెత్త, వ్యర్థాలు పుల్లేరులో డంప్ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది
- నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్న గుర్రపు డెక్క, వ్యర్థాలు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- ఇబ్బంది పడుతున్న కాల్వ కింద రైతులు



యాకమూరు శ్మశానం సమీపాన పుల్లేరులో సగానికి పైగా పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

ఉయ్యూరు, జూలై 2 : వందలాది గ్రామాల ప్రజలకు తాగునీరు, వేలాది ఎకరాలకు సాగు నీరందించే పుల్లేరు కాల్వ ఉయ్యూరు, యాకమూరు పరిధిలో చెత్త, వ్యర్థపదార్థాలతో పూడుకుపోయి డంపింగ్ యార్డును తలపిస్తుంది. యాకమూరులో సేకరించిన చెత్త, వ్యర్థాలను పారిశుధ్య సిబ్బంది పుల్లేరులో పోస్తున్నారు. దీంతో కాల్వలో మూడొంతులకు పైగా చెత్తపేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా నిలవడంతోపాటు కుళ్లి ఆ ప్రాంతమంతా దుర్గంధం వ్యాపిస్తుంది. కాల్వలో కొంతమేర గుర్రపు డెక్కతో నిండిపోగా యాకమూరు శ్మశానం సమీపాన చెత్త, వ్యర్థాలతో నిండి కాల్వలో నీరు కన్పించనంతగా పేరుకుపోయింది. కాల్వలో చెత్తడంపింగ్ చేస్తున్నా గ్రామపంచాయతీ ఉద్యోగులు, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోపోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సర్వీసు రోడ్డులో మెడికల్ వ్యర్థాలు

గండిగుంట సర్వీసురోడ్డు మెడికల్ వ్యర్థాలతో నిండిపోతుంది. జాతీయ రహదారి పక్కన గండిగుంట ఫ్లైఓవర్ నుంచి గ్రామసచివాలయం, రైతు సేవాకేంద్రం, ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోడ్డులో వాడి పారేసిన చిరంజిలు, ఇతర మెడికల్ వ్యర్థాలు పోస్తున్నారు. దీంతో గాలులకు అవి సర్వీసురోడ్డు మీదకు వచ్చి ప్రమాదకరంగా ఉన్నాయి. గండిగుంటవైపు నుంచి ఉయ్యూరు వైపు వచ్చే సర్వీసు రోడ్డు అనునిత్యం రద్దీగా ఉంటుంది. అధికారులు స్పందించి మెడికల్ వ్యర్థాలు సర్వీసు రోడ్డుపైన పోయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గండిగుంట ఫ్లైఓవర్ సమీపాన సర్వీసు రోడ్డులో పేరుకుపోయిన మెడికల్ వ్యర్థాలు

గ్రామాల అభివృద్ధికి నిధులు

ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్

గన్నవరం, ఆగస్టు 2 : నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ఎన్ఆర్ ఈజీఎస్ నుంచి రూ. 20 కోట్లు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీరాజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీలు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమస్య తీవ్రత ఉన్న ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేస్తామన్నారు. ముంపు కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. నియోజకవర్గాన్ని ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కంకిపాడు : నియోజకవర్గ అభివృద్ధికి రూ. 23 కోట్లు కేటాయించినట్టు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందన్నారు. అదే విధంగా మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు నియోజకవర్గంలోని పలు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి నిధులు ఇస్తానంటూ హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, మండల పార్టీ అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య, టీడీపీ, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా, యలమంచిలి కిషోర్‌బాబు, దూళిపూడి కిషోర్‌బాబు, సెంగెపు రంగారావు, కొండవీటి శివయ్య, బొప్పూడి శివరామకృష్ణ, పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకటరమణ, కొండా నాగేశ్వరరావు, యార్లగడ్డ రాజాబాబు, బండి శ్రీను, వణుకూరు విక్రం, ఏనుగ జయ, చలవాది రాజా, వీరంకి పావనమూర్తి, అన్నవరపు శివపార్వతి, పచ్చిపాల రాజా, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

దళితులు ఐక్యంగా ముందుకు సాగాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 2 : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పుతో దళితులంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో దళిత నాయకులు బోడెతో కేకు కట్ చేయించి సన్మానించారు. ఈ సందర్భంగా బోడె మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పుతో దళితుల మధ్య సంఖ్యత వస్తుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బొంగరాల అబ్రహాం, డీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పోరంకి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను సత్కరిస్తున్న దళిత నేతలు

ధర్మపోరాటం గెలిచింది..

కంకిపాడు : ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా మంద కృష్ణమాదిగ చేసిన ధర్మపోరాటం గెలిచిందని ఎమ్మార్పీఎస్ నాయకులు వి. దాసు, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కుంపటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు సానుకూలంగా తీర్పును ఇవ్వడంతో శుక్రవారం బస్టాండ్ సెంటర్‌లో మంగకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బసవయ్య, ఎ. నాగేశ్వరరావు, కలపాల బాబీ, యాకోబు, రాజేష్, పి. ప్రభాకర్, జి. జయరాజు, యు. టైటన్ పాల్, ఐ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు మంద కృష్ణమాదిగ

గన్నవరం : పోరాటయోధుడు మంద కృష్ణ మాదిగ అని ఎంఈఎఫ్ జిల్లా నాయకుడు దేవరపల్లి ఏసుబాబు అన్నారు. స్థానిక అంబేడ్కర్ పార్క్ కమ్యూనిటీ హాల్‌లో సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణపై సానుకూలంగా తీర్పు ఇచ్చినందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. నాయకులు కొడాలి జోసఫ్, కెవి ప్రసాద్, ఎలీషా దేవసహాయం, సతీష్‌కుమార్, జ్ఞానానందం, నిడమర్తి నాగేశ్వరరావు, ఏసురత్నం, చక్రవర్తి, అభినేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సామాజిక న్యాయం

హనుమాన్‌జంక్షన్ : చంద్రబాబుతోనే సామాజిక న్యాయం సాధ్యమని, ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు న్యాయ సమ్మతంగా తీర్పు ఇవ్వడం హర్షణీయమని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ మండల కార్యాలయంలో రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల టీడీపీ దళిత సంఘం నాయకులు హర్షం వెలిబుచ్చుతూ కేక్ కట్ చేసి ఒకరికొకరు సంతోషాన్ని వ్యక్తం చేసుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి రాజేశ్, గండేపూడి నితీష్‌కుమార్, కాంద్రు అజయ్, బొకినాల సాంబ శివ రావు, జీవరత్నం, పచ్చిగళ్ల రాజేశ్, వినయ్, నిమ్మకూరు కిరణ్, గంగరాజు, గాలంకి అప్పారావు, భాగ్యారావు, చీలి ఆనంద్, ఉప్పులూరి జయరాజు, పాతూరి శాంతి తదితరులు పాల్గొన్నారు.

● సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తు శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకుడు అయినంపూడి ఆశీర్వాదం నాయకత్వంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం జరిపి కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం రాత్రి సెంటర్‌లో దళిత సామాజిక కార్యకర్త పింగళి జోజిబాబు నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

అంకమ్మ తల్లికి ఆషాఢం సారె

పెనమలూరు, ఆగస్టు 2 : ఆషాఢమాసం సందర్భంగా పెనమలూరు చిన్నగుడి సెంటరులోని అంకమ్మతల్లి ఆలయంలోని అమ్మవారికి గ్రామస్థులు శుక్రవారం ఆషాఢం సారె సమర్పించారు. ఈ సందర్భంగా నవులూరి సాయిబాబు దీక్షితులు ఆధ్వర్యంలో అంకమ్మతల్లి కృపాకటాక్షాలతో ప్రజలందరూ క్షేమంగా ఉండాలని, అంకమ్మతల్లి ప్రతిఒక్కరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుతూ, మంగళవాయిద్యాల నడుమ మహిళలతో కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో అంకమ్మతల్లి

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

ఉంగుటూరు, ఆగస్టు 2 : తల్లిపాలు చిన్నారులకు శ్రేయస్కరమని గన్నవరం సీడీపీవో పి.వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని వెల్దిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను సెక్టార్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీడీపీవో తల్లిపాల ఆవశ్యకత, ప్రయోజనాలపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం ఆర్.సుకన్య, ఉపాధ్యాయురాలు సీహెచ్ మార్గరేట్‌రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.



తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో వెంకటలక్ష్మి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : నవజాత శిశువులకు తల్లిపాలు అమృతతుల్యమైన వని, ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ పౌష్టికాహారం తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఏఎన్ఎం కమలకుమారి తెలిపారు. వీరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బాలింతలు, తల్లులు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హేమలత, రజని, విజయకుమారి, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బోళ్లపాడు(ఉయ్యూరు) : ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని బోళ్లపాడు అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిపాల ప్రాముఖ్యత తెలిజేస్తూ ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గ్రామ సచివాలయ ఆరోగ్య కార్యదర్శి రోహిణీలక్ష్మి తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త ఇందిర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యూరు నుంచి వాడపల్లికి బస్సులు

ఉయ్యూరు, ఆగస్టు 2 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనార్థం ఉయ్యూరు ఆర్టీసీ డిపో నుంచి బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం వాడపల్లికి విజయవాడ మీదుగా శని, ఆదివారాల్లో బస్సులు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ కెఎస్‌ఆర్‌కె ప్రసాద్ శుక్రవారం తెలిపారు. బస్‌స్టాండు నుంచి ఉదయం 4 గంటల నుంచి బస్సులు బయలు దేరతాయని, భక్తులు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జడ్పీ స్కూల్‌లో మానవత సేవలు

ఉయ్యూరు, ఆగస్టు 2 : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు మానవత స్వచ్ఛంద సంస్థ ఉయ్యూరు శాఖ సేవలందించిది. పాఠశాల ఆవరణలో 20 సెంట్ల భూమిలో మొక్కలు జేసీబీతో తొలగించి చదును చేసారు. మండల విద్యా శాఖ అధికారి- 2 బి. సుధారాణి మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేర పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి కూరగాయలు పండించి వాటితో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో సమతుల్యతతో కూడిన పోషకాహారం అందించాలన్న లక్ష్యం మేరకు మానవతా స్వచ్ఛంద సంస్థ సహకారం అభినందనీయమన్నారు. సంస్థ చైర్మన్ కొలసాని రవికుమార్, సాకి రాజేశ్, సభ్యులు ఫణికుమార్, నాగకుమార్, జేవీ రమణ, జీవీ ఎంవీ లాల్ పాల్గొన్నారు.



వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. రాజు

కంకిపాడు, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు అన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, అణగారిన వర్గాలు ఐక్యమత్యంగా ఉండాలన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం పార్టీలు ఎస్సీలను విడదీస్తున్నాయని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీన హలో మాల..చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో పోరాడతామని తెలియజేశారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న రాజు

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	96, 105, 116
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.50

సంజీవని వైద్యశాలలో ధన్వంతరీ వార్డు ప్రారంభం నేడు

కూచిపూడి : కూచిపూడిలో రవిప్రకాష్ సంజీవని వైద్యశాల ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు కూచిభొట్ల ఆనంద్ తెలిపారు. కూచిపూడిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంజీవని వైద్య శాలలో ఆధునిక వసతులతో ఏర్పాటు చేసిన ధన్వంతరి వార్డును శనివారం రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభిస్తారన్నారు. ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్ రాజా, ఆర్వీపీ అధినేత రవిప్రకాష్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు.

వైద్య సేవల్లో అలసత్వాన్ని సహించేది లేదు

గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రి తనిఖీ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ : వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఏరియా ప్రభుత్వాసుపత్రిని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్‌ను పరిశీలించి, సక్రమంగా మందులు అందుతున్నాయా లేదా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ప్రభుత్వాసుపత్రిలో గర్భిణీ మృతి చెందిన విషయమై వైద్యులను వివరణ అడిగారు. గైనకాలజిస్ట్ వార్డులో వైద్య పరీక్షలను పరిశీలించి, గర్భిణిలతో మాట్లాడారు. ఆసుపత్రిలో సమస్యలన్నింటి రాసి ఇవ్వాలని సూపరింటెండెంట్ ఇందిరాదేవిని కోరారు. ప్రభుత్వాసుపత్రిలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా స్పష్టమైన ఆదేశాలను ఇచ్చినట్లు తెలిపారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, వివిధ విభాగాల వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రి ఓపీ రిజిస్టర్ పరిశీలిస్తున్న వెనిగండ్ల

రూరల్, నందివాడ టీడీపీ అధ్యక్షులు వాసే మురళీ, దానేటి సన్యాసిరావు, ఉపాధి హామీ పథకం ఏపీవో దేవానందరాజు, పంచాయితీ రాజ్ ఏఈలు రాధాకృష్ణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి రూ.23 కోట్లు మంజూరు

గ్రామాల అభివృద్ధికి ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.23 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. ప్రజావేదికలో ఆర్ డబ్ల్యూ ఎస్, పంచాయితీరాజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రాధాన్యతా క్రమంలో సీసీ రహదారులు, డ్రైనేజీల అభివృద్ధికి పూర్తిస్థాయిలో అం చనాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమస్యలు తీవ్రంగా ఉన్న గ్రామాల్లో నిధులను వినియోగిస్తామన్నారు. డ్రైనేజీలు నిర్మించే అవకాశం లేనిచోట కచ్చా డ్రైన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, గుడివాడ

అభిమాని కుమార్తెకు ఆసియాగా నామకరణం చేసిన ఎమ్మెల్యే రాము

గుడ్లవల్లేరు : డోకిపర్రు గ్రామానికి చెందిన టీడీపీ పార్టీ మైనార్టీ నాయకుడు జానీకి ఇటీవల కుమార్తె జన్మించింది.



ఈ నేపథ్యంలో తన అభిమాన నాయకుడు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రామును కలిసి తన కుమార్తెకు నామకరణం చేయాలని కోరగా, ఎమ్మెల్యే రాము ఆ పాపకు ఆసియాగా నామకరణం చేసి భవిష్యత్ బాగుండాలని ఆశీర్వదించారు. జానీ, అతని భార్య ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాముకు కృతజ్ఞతలు తెలిపారు.

రక్షణ శాస్త్రవేత్త సతీష్‌రెడ్డిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి

కోడూరు : అంతరిక్ష పరిశోధకునిగా ఎదిగిన భారత రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్‌రెడ్డిని గ్రామీణ విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మాచవరం ఎంపీపీ స్కూల్‌లో పేద విద్యార్థులకు పుప్పాల నరసింహారావు - పుష్ప లీలావతి జ్ఞాపకార్థం వారి కుమారులు పుప్పాల ధనుంజయరావు(లండన్), పుప్పాల నరేష్ (అమెరికా) ఆర్థిక సహాయంతో పుప్పాల వీరాంజనేయులు ప్రోత్సాహంతో రూ.35 వేల విలువ గల నోట్ పుస్తకాలు, విద్యాసామగ్రిని ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంఈవోలు రామదాసు, శ్రీనివాసరావు, సర్పంచ్ అప్పికట్ల లక్ష్మీ, చీకటి రాజగోపాల్, హెచ్ఎం వీరంకి బుజ్జిబాబు, కూరాకుల శివప్రసాద్, కూరాకుల చంద్రశేఖర్, కూరాకుల శివయ్య, నరహరిశెట్టి మాణిక్యాలరావు, అడపాల వెంకయ్య పాల్గొన్నారు.





పెదకళ్లేపల్లిలో దుర్గాదేవికి సారె సమర్పిస్తున్న మోపిదేవి ఆలయ ఈవో, అర్చక బృందం, శాకంబరీదేవి అలంకారం

పైడమ్మకు సారె తీసుకెళ్తున్న కొత్తపేట మహిళలు

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ

మోపిదేవి,ఆగస్టు 2 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నుంచి పెదకళ్లేపల్లిలోని దుర్గాదేవికి శుక్రవారం ఆషాఢ సారె సమర్పించారు. లోక కల్యాణార్థం ప్రతి సంవత్సరం సారె సమర్పించటం ఆనవాయితీ. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు బుద్దు పవన్ కుమార శర్మ, వేదపండితులు నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ మోపిదేవి నుంచి సారె తీసుకుని ఈవో ఎస్.వస్.చక్రధరరావు నేతృత్వంలో తరలివచ్చి పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వర స్వామి దేవస్థానంలో కొలువై ఉన్న దుర్గాదేవికి అర్చక బృందానికి అందజేశారు. అమ్మవారిని విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెడన : గ్రామదేవత పైడమ్మ అమ్మవారికి కొత్తపేటకు చెందిన మహిళలు శుక్రవారం ఆషాఢ సారె సమర్పించారు. కొత్తపేటకు చెందిన 70 మంది మహిళలు విజయగణపతి ఆలయం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి పైడమ్మ దేవస్థానానికి చేరుకుని అమ్మవారికి చీరె, పసుపు, కుంకుమ, చలిమిడి, పండ్లు తదితరాలతో కూడిన ఆషాఢ సారె సమర్పించారు. సారె సమర్ప ణ కోసం దేవస్థానానికి వచ్చిన మహిళలకు ఈవో టి.వి.వి. మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు సాదర స్వాగతం పలికారు.



గుడివాడలో గౌరీదేవికి ఆషాఢ సారె తీసుకెళ్తున్న మహిళలు

శాకంబరీ మహోత్సవం

మోపిదేవి : పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వర స్వామి ఆలయంలో శాకంబరీ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈవో ఎస్.ఎస్. చక్రధరరావు ప్రత్యేక పూజ లు చేసి వేడుకను ప్రారంభించారు. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ వేదపండితులు నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ, విజయవాడకు చెందిన బొర్రా సుధీర్ బాబు మూడు టన్నుల కూరగాయలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్లు వితరణ చేయగా, ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. దుర్గాదేవి, పార్వతీ అమ్మవార్లను కూరగాయలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. భక్తులు దర్శించుకుని తరించారు. **మచిలీపట్నం టౌన్ :** ఆషాడమాసం సందర్భంగా సువాసినులు పోతేపల్లి విజయ కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించారు. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. అన్నసమారాధన జరిగింది. ఆలయ ధర్మకర్త కాగిత ఏడుకొండలు పామర్తి నాగేశ్వరరావు, మట్టా నాగరాజు, కాగిత రాజేంద్రప్రసాద్, నవీన్‌కుమార్, వీరబాబు పాల్గొన్నారు. **చల్లపల్లి :** అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఏకాదశ రుద్రాభిషేకాలు, విశేష పూజలు చేయగా, అన్నపూర్ణాదేవిని శాకంబరీ దేవిగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు ఘంటసాల శతానందశాస్త్రి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు దర్శించుకుని తరించారు. **నాగాయలంక :** గణపేశ్వరం గణపేశ్వరస్వామి ఆలయంలో దుర్గాదేవి శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సంగమేశ్వరస్వామికి పోతుకూచి నాగ వెంకట సాయి శర్మ మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు జరిపారు ధర్మకర్త మండల శ్రీ రామచంద్ర మూర్తి, అరుణ, దేవదాయశాఖ సిబ్బంది, భక్త సమాజం, గ్రామస్థులు పాల్గొన్నారు. **గుడివాడ :** గౌరీశంకరస్వామి దేవస్థానంలో అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు కదంబ ప్రసాదాన్ని అందించారు. ఈవో నటరాజన్ షణ్ముగం, వేద పండితులు లంకా గిరిధర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. **పామర్రు :** పామర్రు గ్రామదేవత గంగానమ్మకు మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. శాకంబరీదేవికి అమ్మవారు దర్శనమిచ్చారు. అంకమ్మతల్లి ఆలయంలో రేణు కా పరమేశ్వరస్వామికి శుక్రవారం విశేష పూజలు జరిపారు. అన్నాభిషేకాన్ని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా, ఏఎం సీ మాజీ ఛైర్మన్ వల్లూరిపల్లిగణేష్ జరిపారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. వరదా అప్పారావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

అవనిగడ్డ : జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య తెలుగు వారు కావటం ప్రతి ఒక్కరికి గర్వకారణం అని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అన్నారు. పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ పూలమాల వేసి నివాళులర్పించారు. మండవ బాలవర్థిరావు, పుప్పాల వీరాంజనేయులు, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, శోభిల ఏడుకొండలు, యలవర్తి చిన్నా పాల్గొన్నారు. **మోపిదేవి :** జయంతి సందర్భంగా పెదకళ్లేపల్లిలో ఆయన విగ్రహానికి వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యురాలు అరజా ఆషాదేవి తదితరులు నివాళులర్పించారు. గ్రామస్థులు అరజా కిరణ్ కాంత్, చోడగం రాధాకృష్ణ, గొర్రెపాటి నాగేశ్వరరావు, తోట కృష్ణాంజనేయులు తదితరులు ఉన్నారు. **పెడన :** పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలని జనసేన పార్టీ సెంట్రల్ కమిటీ కో కన్వీనర్ దాసరి సత్యనారాయణ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో పింగళి వెంకయ్య జయంతి నిర్వహించారు. వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మట్టా శివపావని, నాని, వహబ్‌ఖాన్, బెజవాడ నాగరాజు, హమీదుల్లా తదితరులు పాల్గొన్నారు.



హౌసింగ్ ఏఈ భాస్కరరావు దంపతులకు సత్కారం

కూచిపూడి : నిజాయితీ గల అధికారిగా వి.వి.భాస్కరరావు మన్ననలు అందుకున్నారని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మొవ్వ మండల హౌసింగ్ ఏఈగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన భాస్కరరావు వీడ్కోలు సభ మొవ్వ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. భాస్కరరావు దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో చంద్రశేఖర్ రావు, సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, ఎంపీపీ కొండేటి ఇందిర, తహసీల్దార్ మస్తాన్‌రావు, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు వేమూరి పరిశుద్ధరాజు, నన్నపనేని వీరేంద్ర, లింగమనేని రామలింగేశ్వరరావు, శ్రీకృష్ణ, రత్నగిరిరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



చలమలశెట్టి సీతామహాలక్ష్మికి ఘననివాళి

చల్లపల్లి : కమ్యూనిస్టు పార్టీల అవసరం దేశానికి ఎంతో ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అన్నారు. మహిళా సమాఖ్య నేత చలమలశెట్టి సీతామహాలక్ష్మి నాల్గో వర్థంతి నూకలవారిపాలెంలో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న బెనర్జీ మాట్లాడుతూ, సీపీఐ అగ్రనేతలు చండ్ర రాజేశ్వరరావు, రామలింగయ్య స్ఫూర్తితో సీతామహాలక్ష్మి ముందుకు నడిచారనీ, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా భర్త కృష్ణారావు అడుగు జాడల్లో నడుస్తూ మహిళా స్వావలంబన కోసం పాటుపడ్డారని గుర్తుచేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, సీతామహాలక్ష్మి కుమారులు చలమలశెట్టి వెంకటరావు, నాగభూషణరావు పాల్గొన్నారు.

పాడిపశువుల పెంపకం లాభదాయకం

గుడివాడ రూరల్ : పాడి పశువుల పెంపకం లాభాదాయకమని గుడ్లవల్లేరు పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు అన్నారు. లింగవరం గ్రామంలో గోకుల్ మిషన్ పథకం ద్వారా ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం ప్రోత్సాహాలు అందిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ ఉన్నం హనుమంతరావు, డాక్టర్ వేణు, డాక్టర్ హరిత, డాక్టర్ చింతయ్య, టీడీపీ నాయకులు, గ్రామస్థులు గాదెరెడ్డి చిరంజీవిరెడ్డి, శివరామకృష్ణ, గోపాలకృష్ణ, కాటూరి ఏసుపాదం, రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదుకు మంచి స్పందన

చల్లపల్లి : చల్లపల్లి బస్టాండ్ సెంటరు, లక్ష్మీపురం ప్రధాన సెంటరులో శుక్రవారం జనసేన సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభించింది. యువనేత మండలి వెంకట్రామ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలువురికి జనసేన సభ్యత్వాలను అందజేశారు. సూదాని నందగోపాల్, తోట మురళీకృష్ణ, మిరియాల జితేంద్ర, ఉరిమి మణికాంత్, బొందలపాటి వీరబాబు, పసుపులేటి రవికుమార్, అడపా రవి, గోళ్ల ప్రసాద్, బొందలపాటి సాంబశివరావు, సోమరౌతు చిన్మయ్, వేమూరి గోవర్ధన్ పాల్గొన్నారు.





శరత్‌గోపాల్‌కు పెంజెండ్రలో ఘననివాళి

గుడ్లవల్లేరు : నాలుగు దశాబ్దాలు పెంజెండ్ర అభివృద్ధిలో శరత్‌గోపాల్ భాగస్వాములయ్యారని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త బొప్పన శరత్‌గోపాల్ సంస్మరణ సభ స్థానిక ఇందిర మహల్‌లో జరిగింది. శరత్ గోపాల్ ఎంత ఉన్నత స్థానాలకు ఎదిగినా జన్మభూమిని మరవకుండా అవసరమైన అన్నివేళలా తన సాయాన్ని అందించారని వక్తలు పేర్కొన్నారు. తొలుత ఆయన బొప్పన తారాచంద్ర, కుసుమ, నాదెళ్ళ కావ్య, నన్‌దీప్ బంధువులు, గ్రామస్థులు, విద్యార్థులు పుష్పాంజలి ఘటించారు. బొప్పన శివప్రసాద్, బొప్పన మోహనరావు, బలుసు జితేంద్ర, కిషోర్, రవిశేఖర్, బలుసు శంకరావు, జగన్మోహనరావు,బలుసు సంధ్య, భాగ్యలక్ష్మి,వరప్రసాద్, లంకా నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుల చొరవ

మచిలీపట్నం టౌన్ : అరిసేపల్లి పంచాయతీ పరిధిలో హుస్సేన్‌పాలెం నుంచి చిట్టిపాలెం వెళ్లే దారిలో చెత్త రోడ్డు మీదకు ఎగిరి రావడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. జనసేన నాయకులు బొప్పూడి చంటి, హుస్సేన్‌పాలెం నాయకులు కాగిత అన్వేష్ స్పందించి తన సొంత నిధులతో ఎక్స్‌కవేటర్‌తో చెత్తను తొలగించి శుభ్రం చేశారు.



పాముకాటు వైద్యుడు వెంకట రమణ మృతి

మచిలీపట్నం టౌన్ : చిన్నాపురం గ్రామానికి చెందిన పాముకాటు వైద్యుడు మెండు వెంకటరమణ ప్రమాదవశాత్తూ నీట మునిగి గురువారం రాత్రి మృతి చెందాడు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, గడ్డం రాజు, బొమ్మసాని నరేష్, కె. నాంచారయ్య, జన్ను నాగరాజు, పిచ్చేశ్వరరావు, వాసు తదితరులు నివాళులర్పించారు.

ఆదినారాయణకు మండలి పరామర్శ

కోడూరు : ఇటీవల మాతృ వియోగానికి గురైన టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం పరామర్శించారు. పిట్టలంక గ్రామంలోని ఆదినారాయణ స్వగృహంలో మాచవరపు సుబ్బారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళి అర్పించారు. మండవ బాలవర్థిరావు, మర్రే గంగయ్య, బడే హనుమంతరావు, కాగిత రామారావు, కొల్లూరి ఇమ్మానియేలు, గాదే భాస్కరరావు, కొల్లూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

మొవ్వ తహసీల్దార్‌గా మస్తాన్‌రావు

కూచిపూడి : మొవ్వ తహసీల్దార్‌గా కలిదిండి మస్తాన్‌రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నుంచి బదిలీపై మొవ్వ మండలానికి వచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ గోపాలరావు, కె.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ విజయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ శ్యామ్యూల్, వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.



పమిడిముక్కల తహసీల్దార్‌గా నవీన్‌కుమార్



పమిడిముక్కల : పమిడిముక్కల తహసీల్దార్‌గా కె.నవీన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఉయ్యూరులో ఆర్డీవో డి.రాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా రవికుమార్

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా టి. రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా ఉన్న శ్రీనివాసరావు స్థానంలో రవికుమార్‌ను నియమిస్తూ కళాశాల ఛైర్మన్ కొనకళ్ల ఉత్తర్వులు జారీ చేశారు.

ఆలయంలో యాగశాల ప్రారంభం

గుడివాడ : భీమేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో పట్టణ వైదిక స్మార్త పురోహితుల సంఘం ఆధ్వర్యంలో రూ.1.25 లక్షల వ్యయంతో నిర్మించిన యాగశాలలను శుక్రవారం ప్రారంభించారు. ఈవో నటరాజన్ షణ్ముగం, పురోహిత సంఘం పెద్దలు భైరవభొట్ల విజయకుమార్, దేవుళ్ళపల్లి శ్రీనివాసశాస్త్రి, దేవరకొండ శేషఫణి శర్మ, బొర్రా సుబ్రహ్మణ్యం, జోగా సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుపై ఎమ్మార్పీఎస్ సంబరాలు

ఘంటసాల : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. కొడాలి సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు దేవరపల్లి సతీష్ బాబు, కలపాల సాగర్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు కోన రాజశేఖర్, కొడాలి జాషువా, మాచవరపు అశోక్ కుమార్, కనగాల సుధీర్ తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** చల్లపల్లిలో ఎమ్మార్పీఎస్ యువకులు సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ నేతలు, యువకులు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన సెంటర్లో బాణాసంచా పేల్చి సందడిచేశారు. కేక్ కట్‌చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొక్కిలిగడ్డ నవీన్, నియోజకవర్గ అధ్యక్షుడు కొడాలి ఏలియా తదితరులు పర్యవేక్షించారు. **పమిడిముక్కల :** వర్గీకరణ విషయమై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ కపిలేశ్వరపురం ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం సంబరాలు జరుపు కున్నారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు. మండల కన్వీనర్ వేల్పూరి మధు తదితరులు పాల్గొన్నారు.



నేతన్న విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

పెడన : చేనేత కేంద్రం పెడనలో నేతన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరుతూ ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ (ఏఐడబ్ల్యుఎఫ్) నాయకులు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. అనువైన స్థలాన్ని కేటాయిస్తే నేతన్న విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని ఫణికుమార్, జనార్దనరావు, సాంబశివరావు తెలిపారు.

డ్రైనేజీలు, పంట కాలువల్లో పూడికతీత పనులు

చల్లపల్లి : పంటకాలువలు, మురుగకాల్వల్లో పూడికతీత పనులు చేపట్టారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. బండిరేవుకోడులో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులను డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఏఈఈ హరీష్ శుక్రవారం పర్యవేక్షించారు. చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పనులను పర్యవేక్షించి డ్రైనేజీ అధికారులతో పనుల విషయమై చర్చించారు. పురిటిగడ్డ, నడకుదురు పరిధిలో ఏడో నెంబరు పంట కాలువలో పూడికతీత పనులు చేపట్టగా, ఎంపీటీసీ సభ్యుడు మేకా బంగారుబాబు, జనసేన నేత వేమూరి గోవర్ధన్, లస్కర్ మూర్తి పర్యవేక్షించారు.

బిడ్డకు తల్లిపాలే ఆరోగ్యకరం

గుడివాడ రూరల్ : తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. చిరుచింతల, నాగవరప్పాడు తదితర ప్రాంతాల్లో తల్లిపాలు ఇవ్వటం వల్ల బిడ్డలకు ఎంత మేలు జరిగేది తల్లులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. **నందివాడ :** పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని ఏఎన్ఎం మోహన శ్రీలక్ష్మీ తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సిహెచ్‌వో ప్రేమలత, అంగన్‌వాడీ టీచర్స్ జ్యోతిర్మయి, సుగుణ కుమారి, గర్భిణులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

